
## వ్యంగ్యం :




ఇటీవల బెంగుళూరులో జరిగిన ఒక శాస్త్రజ్ఞుల మహాసభకు వెళ్లి వివరాలను పంపవలసిందని 'విశ్వరూపం' సంపాదకుడుగారు చెప్పినప్పుడు, అక్కడ చాల ఉత్సాహం కలిగించే విషయాలను తెలుసుకోవచ్చని అనుకున్నానేకాని, ఇంత గొప్ప నాటకానికి సూత్రధారుణ్ణి అవుతానని ఊహించలేకపోయినాను.

మహాసభవారు సోవియట్ జీవశాస్త్రజ్ఞుడు లిసెంకో పరిశోధనలను గురించి చర్చిస్తున్నారు. బాహ్యపరిస్థితులవల్ల జీవజంతువులలో కలిగిన మార్పులు వాటి సంతానానికి కూడా సంక్రమిస్తవా లేదా అన్న సమస్య అది. కాని చర్యమాత్రం రాను రాను శాస్త్రీయాంశాలను వదిలిపెట్టి సోవియట్ రాజ్యాంగంమీదనూ, కమ్యూనిస్టు సాంఘికనీతిమీదనూ తర్జనభర్జనలుగా మారిపోయింది. స్టాలిన్‌ని విమర్శించే మాటలతో ఒక రచయిత తన 'శాస్త్రీయ' వ్యాసాన్ని మొదలుపెట్టటంతో వ్యవహారం శ్రుతిమించి, అధ్యక్షుడు చర్చను వాయిదా వేశాడు.

అంతా బయటికి వస్తుండగా కనిపించాడు ఆయన. పేరు ప్రొఫెసర్ శేఖర్. ——పరిశోధనాలయంలో జీవరసాయనశాస్త్రనిపుణుడు.

శాస్త్రజ్ఞుల్లో కూడా నిర్మాణాత్మకమయిన దృష్టి లోపిస్తున్నందుకు ఆయన విచారాన్ని వెల్లడిస్తూ, దేశాన్ని ఎదుర్కొంటున్న ముఖ్యసమస్యలమీద వాళ్లు తమ దృష్టిని ప్రసరింపచేస్తే బాగుంటుందని అన్నాడు. నేను ఆహారసమస్యనుగురించి ప్రస్తావించాను. ఆయన వెంటనే అత్యుత్సాహంతో ఒక విషయం చెప్పాడు. రాజాజీ ఒకసారి మైసూరులో మాట్లాడుతూ గడ్డిలోనుంచి పాలను తీయాలని సూచించాడనీ, ఆ విషయమై తన పరిశోధన దాదాపు నెగ్గినదనీ ఆయన అన్నాడు. కొంతసేపు మాట్లాడి వివరాలు తెలుసుకున్న తరవాత ఈవిషమై రాజాజీనే కలుసుకొనటం మంచిదని సూచించాను.

* * *

ఆ తరవాత ఆయన కోరికమీద, నానా తంటాలూ పడి రాజాజీతో ఇంటర్‌వ్యూ సంపాదించాను.

* * *

(ఢిల్లీలో హోంమంత్రికార్యాలయంలో రాజాజీ గది. రాజాజీ కూర్చుని ఉండగా నేను ప్రొఫెసర్ శేఖర్‌తో కలిసి ప్రవేశించాను.)

నేను : నమస్తే రాజాజీ.

రాజా : నమస్తే, రండి? కూర్చోండి... మీరు——

నేను : మీరు లోగడ మైసూర్ వొచ్చినప్పుడు ఇచ్చిన సందేశం గుర్తున్నదనుకుంటాను.

రాజా : ఏ అంశానికి సంబంధించినది?

నేను : శాస్త్రజ్ఞులు గడ్డిలోనుంచి పాలను తీసేమార్గం కనిపెట్టాలని మీరు హెచ్చరించారు.

రాజా : (చిరునవ్వుతో) అవును. కొంప తీసి ఎవరయినా కనిపెట్టలేదు గదా?

నేను : సరీగా అదే జరిగింది.

రాజా : (ఆశ్చర్యంతో) ఆఁ! నిజం?

నేను : ఇంత తంటాలుపడి మీ దగ్గరకు వొచ్చింది పరాచికాలాడేందుకా?

రాజా : (ఆముదం మింగుతున్న ముఖం పెట్టి) అయితే ఎవరు కనిపెట్టారు?

నేను : ఇదుగో ప్రొఫెసర్ శేఖర్ గారు. వీరే దానిని సాధించారు

రాజా : వీ రేం చేస్తుంటారు?

నేను : ——పరిశోధనాలయంలో జీవరసాయనశాస్త్రనిపుణులు. అసలు అభిప్రాయం కలిగించినవారు మీరుకనుక, ముందు మీతోనే సంప్రదించటం మంచిదనుకున్నాం.

(రాజాజీ నెమ్మదిగా కోలుకుంటాడు. ఇంతలో టెలిఫోన్ మోగింది.)

రాజా : ఎవరది? మున్షీజీ?——

(కొంతసేపు మాట్లాడి ఫోన్ పెట్టేస్తాడు.)

నేను : క్షమించాలి. మీకు అతిజరూర్ పనులేమయినా ఉంటే మళ్ళీ కలుసుకుంటాం.

రాజా : లేదులేదు. సోమనాథ్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన విషయా

లను చర్చించటానికి, నాకు తీరిక ఉంటే వస్తానని మున్షీజీ చెప్పారు.

నేను : వారికి తీరికఉంటే వారుకూడా ఈ పరిశోధనను గురించి వినవచ్చునుకదా! ఏమంటారు ప్రొఫెసర్ ?

శేఖర్ : నిజమే. ఆహార మంత్రిగారు వినటంకన్నా కావలసిం దేమిటి ?

రాజా : (నిస్పృహతో ఒకసారి నావంక చూస్తాడు) అయితే వారందరినీ ఒకసారి పిలిచి చూస్తానులెండి.

(కాసేపు టెలిఫోన్ నిర్విరామంగా పనిచేస్తుంది. కొంచం కాలవిరామం రాజాజీ మామూలు బింకమంతా సడలినట్లు కనిపిస్తున్నాడు. చీటికీమాటికీ నల్లద్దాల కళ్లజోడు తీసి, తుడిచి పెట్టుకుంటున్నాడు. మధ్యమధ్య నావంకా, ప్రొఫెసర్ వంకా అనుమానంతో పక్క చూపులు విసురుతున్నాడు. ఇంతలో నెమ్మదిగా ఒకరితరవాత ఒకరుగా, కె. ఎం. మున్షీ, డా॥ అంబేద్కర్, ఎన్. వి. గాడ్గిల్, మహావీర్ త్యాగి ప్రవేశిస్తారు. పరామర్శలయి అంతా సర్దుకుని కూర్చున్నారు.)

నేను : (లేచి నిలబడి) ఎవరూ పరిచయం చేయనిదే మాట్లాడుతున్నందుకు అంతా క్షమించాలి. మాది విలేఖరులకులం అని తెలిస్తే మీరు తప్పకుండా క్షమిస్తారు.

అంబేద్కర్ : అది మాకు కొత్తేమీ కాదు లెండి.

నేను : ప్రస్తుత భారత ప్రభుత్వ నాయకులందరిలోనూ రాజాజీ అదృష్టవంతులని చెప్పాలి.

అంతా : హియర్ ! హియర్ !

నేను : గాంధీజీ అంతటి వ్యక్తితోనే పోట్లాడినప్పటికీ చివరకు ఆయనే గద్దె ఎక్కాడు. వెనక కూడా రాజకీయాలను వదిలి ఆశ్రమస్వీకారం చేసినవాడల్లా తెలుచుకోంగానే మద్రాసుప్రధాని అయినాడు. అక్కడివాళ్ళకి ఇప్పుడు ఆయన అవసరం తీరిపోగా, గవర్నర్ జనరలే అయినాడు. ఆయన తెలివితేటలు కనిపెట్టే, అమెరికన్ రచయిత జాన్‌గంథర్ ఆయనకు దక్షిణభారత సృగాలమనే బిరుదును ఇచ్చాడు.

అంతా : శభాష్ ! శభాష్ !

(రాజాజీ నావైపు ఒక కోరచూపు విసిరాడు.)

నేను : అసలు ఆయనది అదృష్టజాతకం. అన్నంలేని జనానికి గడ్డిని తినేమార్గం ఆలోచించమని సలహా ఇచ్చినప్పటికీ ఎవ్వరూ కొంచమయినా కోపం తెచ్చుకోలేదు. ఆ మాట ఒక ఉద్యోగి అన్నందుకే ఇదివరకు ఫ్రాన్సులో రాజరికం శాశ్వతంగా కూలిపోయింది.

అంతా : (నన్ను చురచుర చూశారు.)

నేను : అయితే రాజాజీ అదృష్టం ఎప్పటికీ ఆయన్ను విడిచిపెట్టదు. గడ్డిలోనుంచి పాలను తయారుచేయాలని ఆయన ఉపన్యాసధోరణిలో, ఒక ఛలోక్తికింద, విసిరినమాట ఈనాడు నిజం అవుతున్నది.

అంతా : (ఆశ్చర్యంతో) ఆఁ! ఆఁ! ఏమిటి ?

నేను : అవును, నేను ఎంతమాత్రం అతిశయించి చెప్పటంలేదు. ప్రతిభావంతుడి ప్రతిభను మరొక ప్రతిభావంతుడే కనిపెట్ట కలుగుతాడు. అట్లాగే రాజాజీ సూచనలో గొప్పదనాన్ని కనిపెట్టి దానిని యథార్థం చేయగల ప్రతిభ మన మిత్రుడు ప్రొఫెసర్ శేఖర్‌లో ఉన్నది.

(నేను కూర్చున్నాను.)

రాజా : మన మిత్రుడు పత్రికారచయిత ధోరణిలో చెప్పిన అతిశయోక్తులను మినహాయించి చూస్తే, ప్రొఫెసర్ శేఖర్ పరిశోధన ఆహార దుర్భిక్షంతో బాధపడుతున్న మన దేశానికి ఎంత తోడ్పడుతుందో గ్రహించగలం.

మున్షీ : ఆర్యమహర్షులు నిత్యం పాలను సేవించే, అంత ఉన్నత సంస్కృతికి పునాదులు వేయకలిగారు. శేఖర్ గారి ప్రయత్నం నెగ్గేట్లయితే, సాత్వికాహారమయిన పాలతో మన ప్రజల సంస్కృతి ఇంకొకమెట్టు పైకి వెళ్ళగలదు. కాబట్టి వారి సూచన గమనించవలసిందే.

మహావీర్ : ప్రొఫెసర్ సాబ్ ! మీరు దయచేసి విషయాన్ని వివరించాలి.

రాజా : ముందు వీరిని పరిచయం చేయనివ్వండి. వీరి పేరు ప్రొఫెసర్ శేఖర్. ప్రస్తుతం రాజకీయరంగంలో కనిపిస్తున్న నామమాత్ర ప్రొఫెసర్లవంటివారు కాదు వీరు. (అంతా ముసిముసినవ్వులు)-పరిశోధనాలయంలో జీవరసాయన నిపుణులుగా ఉంటూ, దేశానికి మాటలతో కాకుండా క్రియలతో సేవ చేస్తున్నారు. వీరిప్పుడు తమ పరిశోధనని వివరిస్తారు.

(అంతా చప్పట్లు)

శేఖర్ : మీరంతా నా పరిశోధనపట్ల ఇంత శ్రద్ధను చూపిస్తున్నందుకు ఎంతో కృతజ్ఞుణ్ణి. అయితే నాకీ అవకాశాన్ని కలిగించిన విశ్వరూపంవిలేఖరి గారికి మనమంతా కృతజ్ఞులమై ఉండాలి.

మహావీర్ : జర్నలిస్ట్‌భాయ్ జిందాబాద్ !

శేఖర్ : గడ్డిలోనుంచి పాలను తీయాలని రాజాజీచెప్పిన విషయం నన్నెంతో ఆకర్షించింది. భారతీయ దృక్పథానికీ, పాశ్చాత్య దృక్పథానికీ, గల తేడా ఏమిటో దీనివల్ల తెలుస్తున్నది. అత్యుత్తమ ఆహారపదార్థమయిన పాలలోనుంచి కాసీన్ అనే పదార్థం తీసి దువ్వెన్లనూ, గుండీలనూ తయారుచేస్తున్నారు పశ్చిమదేశాలవాళ్లు. అతి నీరసమయిన గడ్డిలో నుంచి పాలను తయారుచేయమన్నారు మన రాజాజీ.

మున్షీ : (అంబేద్కర్‌తో) ప్రొఫెసర్ భాయ్‌కి సాంస్కృతిక దృష్టి కూడా ఉన్నదే!

శేఖర్ : ఇంక అసలు సంగతికి వద్దాము. గడ్డిలోనుంచి పాలను తయారుచేయాలంటే ముందు వాటిల్లో ఉన్నపదార్థాలేమిటో తెలుసుకోవాలి. పాలల్లో కాసీన్ అనే మాంసకృత్తులు, లాక్టోజ్ అనే పాలపంచదార, ఫాస్ఫోలిపిడ్ లనే భాస్వర సంబంధమయిన పదార్థాలు, కొవ్వుపదార్థాలు ఉన్నవి. ఇంక గడ్డిలో సెల్యులోజ్ అనబడే వృక్షపదార్థం, పిండిపదార్థం, వివిధలవణాలు, కొంచంగా కొవ్వు ఉన్నవి. మనం చేయవలసిందల్లా ఈ పదార్థాలను ఆ పదార్థాలుగా మార్చటమే.

అంతా : అవునవును.

శేఖర్ : ఒక రకం పదార్థాలను రెండో రకంలోకి మార్చాలంటే వాటిని ముందు మూలపదార్థాలలోకి విడగొట్టి, ఆతరవాత వాటిని మనకి కావలసిన పద్ధతిలో అమర్చుకురావాలి.

గాడ్గిల్ : ఒక ఇంటి ఇటికలతో మరొక ఇంటిని కట్టవలసివస్తే, దానిని పగలకొట్టినట్లన్నమాట.

శేఖర్ : సరిగా అంతే! ఈ మూలపదార్థాలను మా శాస్త్రంలో 'ఇటిక'లు అనే అంటారు. అయితే వీటిని విడగొట్టటమన్నది అంత సులభమయిన విషయం కాదు. అదుగదుగో! ఇంతలోకే దిగులుపడక్కరలేదు. వాటిని పగలగొట్టటానికి ఎంజైమ్స్ అనే పదార్థాలు ఉపయోగపడతవి.

మున్షీ : వాటిని ఎక్కడనుంచయినా తెప్పించుకోవాలా ?

గనోక్వేల్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.

శేఖర్ : అవసరం లేదు. ప్రకృతి సిద్ధంగా మనదేశంలోనే సమృద్ధిగా లభిస్తవి.

మహావీర్ : వందేమాతరం! సుజలాం! సుఫలాం—

శేఖర్ : ముందు గడ్డిలోఉన్న పిండి పదార్థాన్ని విడదియ్యాలి. పిండిని ఉడక బెట్టి టయలీన్ అనే పదార్థాన్ని-ఇవన్నీ ఎంజైమ్స్‌లోనుంచి లభిస్తవి-కలిపిఉంచితే మనం ఎరిగిన మాల్టోజ్ తయారవుతుంది. దానికి ఇన్వర్టేజ్, లాక్టేజ్ అనే పదార్థాలను కలిపితే అది గ్లూకోజ్, గెలాక్టిన్ మొదలైన పంచదారలుగా మారుతుంది. వాటిని తరవాత వాలపంచదారగా మార్చుకోవచ్చు.

గాడ్గిల్ : అయితే పిండిని ఉడకబెట్టకుండా మార్గం లేదూ?

శేఖర్ : లేకేం ఉన్నది. అప్పుడు దానిని మన శరీరోష్ణంకన్నా కొంచం ఎక్కువ వేడిలోఉంచి ఎక్కువ టయలీన్‌తో కలిపి చాలాసేపు మర్దించాలి. అప్పుడు కూడా ఆ మార్పు వస్తుంది.

మున్షీ : అవును. మర్దనం గుణవర్ధనం అన్నాడు చరకాచార్యుడు.

రాజా : అట్లా అన్నది బుద్ధుడి శిష్యుడు జీవకుడేమో?

అంబేద్కర్ : కావచ్చు! హరిజనులు బౌద్ధమతం పుచ్చుకోవాలని నేను ఊరికే అనను మరి.

శేఖర్ : టయలీన్ రూపాంతరమయిన ఎమిలేజ్ అనే పదార్థం పచ్చిపిండినికూడా మార్చగలదు. ఇంక మాంసకృత్తుల విషయం. ఇవి అమినోఆసిడ్ లనబడే మూలపదార్థాలతో తయారయినవి. వీటినే మేము ఇటికలని అంటాం.

అంతా : ఆఁ హాఁ!

శేఖర్ : మాంసకృత్తులను ప్రోటీన్‌లనీ, పాలీపెప్‌టైడ్‌లనీ అంటారు. వాటిని పగలకొట్టాలంటే ముందు హైడ్రోక్లోరిక్ ఆసిడ్‌లో ఊరబెట్టాలి. అప్పుడవి పక్వానికివచ్చి మెటాప్రోటీన్లుగా మారిపోతవి. అప్పుడు వాటికి పెప్సిన్ అనబడే ప్రకృతి సిద్ధమయిన పదార్థాన్ని కలిపితే, అవి పెప్టోన్‌లుగా మారుతవి. ఈ పెప్టోన్‌లను ట్రిప్సిన్ అనే పదార్థంతో పెప్టైడ్‌లుగా విభజించవచ్చు. పెప్టైడ్‌లంటే కొద్దిఅమినో ఆసిడ్‌లే కలిసిన మిశ్రపదార్థాలన్నమాట.

గాడ్గిల్ : వాటిని అట్లాగే ఉపయోగించవచ్చునా?

శేఖర్ : లేదు. ఎరిప్సిన్ అనే పదార్థం వాటిని ఎమినోఆసిడ్‌లుగా విడదీస్తుంది.

మున్షీ : ఇప్పటికి రెండు తేలినయ్!

శేఖర్ : ఇంక మిగిలింది కొవ్వు. రెనిన్, లైపేజ్ అనే పదార్థాలు వాటిని కొంతవరకూ విభజించగలవుకాని పూర్తి విభజన జరగాలంటే కొన్ని పురుగులని ఉపయోగించాలి.

అంతా : ఛీ! ఛీ! ఛీ! ఛూ! ఛూ!

శేఖర్ : పురుగులంటే తోకపురుగులు, గొంగడిపురుగులు కాదండీ.

మున్షీ : అయితే ముక్కుపురుగులా ఏమిటి?

శేఖర్ : కాదు. అవి కంటికి కనిపించని సూక్ష్మక్రిములు.

మహావీర్ : ప్రొఫెసర్ భాయ్! మీకు ఒక సలాం! మీపరిశోధనకు రెండు సలాంలు. మాచేత పురుగుల్ని తినిపిస్తారా?

శేఖర్ : తొందరపడొద్దు. మీరు తాగే తేనె పురుగుల్లోనుంచి వచ్చిందే కదా.

మహావీర్ : అబద్ధం! తేనె పువ్వుల్లో నుంచి వస్తుందిట.

శేఖర్ : పువ్వుల్లో రసాన్ని తేనెటీగలు తాగితే, వాటి పొట్టల్లో అది మనం తాగే తేనెగా మార్పు చెందుతుంది. అప్పుడవి కక్కివేసిన తేనె మనం తెచ్చుకుంటాం.

మహావీర్ : అంతేనా రాజాజీ.

రాజా : అవును.

శేఖర్ : చివరకు ఈ ఎమినో ఆసిడ్లనూ, గ్లూకోజ్‌నూ, అన్నిటినీ కలిపి లాక్టోజ్, కొవ్వు, ఫాస్ఫోలిపిడ్‌లుగా తయారు చేస్తాం.

గాడ్గిల్ : మరి దానికి యంత్రం ఏర్పాటయిందా?

శేఖర్ : ఆ! తయారయింది. ముందు ఒక మరతిరగలిలో గడ్డినివేసి ఆడించాలి. అందులోకి టయలీన్, ఎమిలేజ్‌లు వచ్చే ఏర్పాటు ఉంటుంది. తయారయిన గ్లూకోజ్ మొదలైనవి బయటికి తీయబడతవి. మిగిలిన సరుకులో సెల్యులోజ్, మాంసకృత్తులు, కొవ్వు ఉంటవి. అప్పుడది వేరొకగదిలోకి పంపబడుతుంది. అందులో హైడ్రోక్లోరిక్ ఆసిడ్, రెనిన్, పెప్సిన్, లైపేజ్ మొదలైన పదార్థాలు ఒకదాని తరవాత ఒకటి కలుస్తూఉంటవి. కాసీన్ మొదలైన పదార్థాలను చిలికి పెరుగువలె చేసే సాధనంకూడా దాని చివర అమర్చబడుతుంది. ఇందులో కూడ కొద్దిగా గ్లూకోజ్ తయారయి, బయటికి తోడబడుతుంది. అప్పుడు సరుకు ఒక చిక్కటి గంజిమోసరు ఉంటుంది.

రాజా : తరవాత?

శేఖర్ : ఆ తరవాత మరొకగదిలోకి పోయి ట్రిప్సిన్, ఎమిలేజ్, లైపేజ్ మొదలైనపదార్థాలతో కలుస్తుంది. కొవ్వునుంచి కొంత గ్లిసరిన్ విడిపోతుంది, అక్కడనుంచి సరుకు మెలికలు తిరిగిన ఒక పెద్ద గొట్టంలోకి ప్రవేశిస్తుంది. అక్కడ ఎరిప్సిన్, ఇన్వర్టేజ్, లాక్టేజ్ లైపేజ్ మొదలైనవి ఇందులో కలుస్తవి. తయారయిన గ్లూకోజ్, గెలాక్టోస్‌లు వేరే తీసుకొనిపోబడతవి.

మహావీర్ : ఒకటే రకం పదార్థాలను అన్నిగదుల్లో వేరే వేరే కలపకపోతే ఒక్కసారే కలపకూడదూ?

శేఖర్ : ఈ ప్రక్రియ నెమ్మదిగా అంచెలమీద జరగవలసిందే. ఇంకో మార్గం లేదు. మెలికలగొట్టంలోనుంచి ఆ పదార్థం పురుగులగొట్టంలోకి పోతుంది. అక్కడ కొవ్వు పూర్తిగా విభజించబడుతుంది.

రాజా : ఆ తరవాత?

శేఖర్ : ఎస్ట్రిన్ అనే జంతుసంబంధ పదార్థం మాంసపదార్థాలతో కలిసి పాలను తయారుచేసే పనిముట్లను తయారు చేస్తుంది. అందులో పై సరుకు ప్రవేశించి గ్లూకోజ్ మొదలైనవాటిలో కలిసి పాలు తయారవుతవి. ఈ ప్రక్రియకు ప్రొలాక్టిన్ అనే పదార్థం ఉపయోగిస్తుంది.

మనలో మాట! ఈ ప్రొలాక్టిన్ అనే పదార్థాన్ని ఆడజంతువులకి ఇస్తే వాటికి పిల్లలమీద మమకారం పెరుగుతుందనీ, స్త్రీత్వం ఎక్కువవుతుందనీ కనిపెట్టబడ్డది.

అంబే : నిజం?

శేఖర్ : నిజమే.

అంబే : అయితే హిందూన్యాయశాస్త్ర సవరణబిల్లుకి ఆటంకం ఉండదన్నమాట

అంతా : అదేమిటి? దీంతో దాని సంబంధం ఏమిటి?

అంబే : ఆ బిల్లును ఎదిరిస్తున్న వాళ్లందరికీ ఒక్కటే భయం, ఆడవాళ్లు ఎక్కడ చెవులకి తాటాకులు కడతారోఅని. ఈ మందుని ఆడవాళ్లందరికీ విధిగా ఇప్పిస్తే వాళ్ల భయం తీరిపోతుందని చెప్పొచ్చు.

మహావీర్ : సమగ్గిడిన పిల్లలకు చిమ్మిరి పెట్టినట్లుగానా?

(అంతా నవ్వారు.)

నేరు : కాని డాక్టర్‌సాబ్ కొంపతీ. ఈ ఆడవాళ్లు ఆ సరుకుని మనకే పెడతారేమో!

అంతా : ఆఁ-! ఆఁ!

నేరు : అవును మరి! పిల్లల పెంపకాన్ని వొదిలినట్లే, కనటంకూడా మొగవాళ్లకు నెట్టేస్తారు.

(46-వ పేజీ చూడండి)

# విశ్వామిత్ర సృష్టి

(31-వ పేజీ తరువాయి)

(అంతా నవ్వులు)

శేఖర్ : ప్రొలాక్టిన్ సహాయంతో ఆ క్షీరయంత్రాలు గ్లూకోజ్ నుంచి లాక్టోజ్ నూ, ఎమినోఆసిడ్‌లనుంచి ప్రోటీన్లనూ, కొవ్వునూ లవణాలనూ తయారుచేస్తవి. అంటే గడ్డిలోనుంచి పాలు తయారవుతవన్నమాట.

ఇంక మీరు ప్రశ్నలేమయినా ఉంటే అడగండి.

గాడ్గిల్ : మరి మీ యంత్రం ఏకబిగిన పని చేస్తుందా!

శేఖర్ : అప్పుడప్పుడు విశ్రాంతి ఇవ్వాలి. ఒకే యంత్రాన్ని తెరిపిలేకుండా పనిచేయించేబదులు, నాలుగైదుయంత్రాలని ఒక దాని తరవాత ఒకటి నడిపిస్తే లాభకరమని పరిశోధనవల్ల తేలినది.

ముస్లీ: యంత్రం పనిచేసేటప్పుడు పాలతోపాటు లభించే అన్యోత్పత్తులు దేనికయినా పనికి వస్తవా?

శేఖర్ : అన్యోత్పత్తులు చాలా ఉపయోగించేవే. చివరకు మిగిలిపోయే సెల్యులోజ్, గ్లిసరిన్ మొదలైనవాటిని విలువైన ఎరువులుగా వాడవచ్చును. సెల్యులోజ్‌పదార్థాన్ని సక్ క్యూర్ చేస్తే - అంటే ఎండబెడితే - ఫస్ట్‌క్లాసయిన వంటచెరకు తయారవుతుంది.

గాడ్గిల్ : మరి ఈ యంత్రం పనిచేయటానికి ఏం వాడాలి?

శేఖర్ . నాయంత్రంలో ఉన్న అతిగొప్ప సావకాశం ఇదే. గడ్డిని విభజించేటప్పుడు జరిగే రసాయనప్రక్రియల్లోచాలా ఉష్ణశక్తి ఉద్భవిస్తుంది దానినే యంత్రం ఉపయోగిస్తుంది. అందువల్ల ఒక్కసారి యంత్రాన్ని స్టార్టు చేస్తే వేరే ఇబ్బంది లేకుండా తనకు తానే పనిచేసుకుని పోతుంది. అందువల్ల ఈ పరిశ్రమకు ఫ్యూయల్ సమస్య అంటూ ఉండదు.

మహావీర్ : యంత్రం దెబ్బ తింటే, దానికి శ్క్రాప్ విలువ ఏమయినా ఉంటుందా?

శేఖర్ : యంత్రంకూడా మాంసకృత్తులతో సంబంధించిన పదార్థాలతో తయారవుతుంది. కనుక దానిని జలప్రక్రియ, తైలప్రక్రియలు చేసి ఆహారంగా వాడవచ్చును. యంత్రం వాతావరణంవల్ల దెబ్బతినకుండా అమర్చే లైనింగును ఎన్నో విధాల వాడవచ్చును.

అంబేద్కర్ : యంత్రోత్పత్తికి కావలసిన సామగ్రి మనదేశంలోనే లభిస్తుందా?

శేఖర్ : విదేశాలకు మనమే ఎగుమతి చేయొచ్చు.

రాజా : (వికటంగా) మరి మీయంత్రం పిల్లలనుకూడా పెడుతుందా?

శేఖర్ : ఆహా! కనీసం రెండేళ్లకు ఒక పిల్లను పెడుతుంది.

(రాజాజీముఖాన కత్తి పోటు వేసినా నెత్తురు కనిపించనట్లు తయారవుతుంది. అంతా ఆశ్చర్యంతో నోరుతెరిచి చూస్తూ ఉంటారు)

రాజా: ! (బొంగురు గొంతుతో) మీ యంత్రం పేరేమిటి?

శేఖర్ : (గంభీరంగా) "గమిడి గేద."

(ఆఁ! ఆఁ! అని కేకలు. ఉప్పెనగా నవ్వులు)

ముస్లీ: ప్రొఫెసర్ భాయ్! మీ యంత్రాన్ని మహర్షి విశ్వరథుడు-అంటే విశ్వామిత్రుడు - ఇంతకుముందే సృష్టించినట్లున్నాడే?

నేను : ముస్లీ భాయ్! ఈయన ఎవరనుకుంటున్నారు? విశ్వామిత్రుడి సంతతివాడయిన ఆంధ్రుడు.

కొన్నాళ్లకు ఆలిండియా రేడియో ఈ విధంగా ప్రకటించింది:

"కేంద్రప్రభుత్వ ఆహార-వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన దేశమంతటా విశ్వరథోత్సవం జరిగినది. అనేకచోట్ల మహిషామండలులు నెలకొల్పబడినవి. ప్రభుత్వపు ముద్రలో మహిషీవిగ్రహానికి స్థానం ఇచ్చే విషయమై పార్లమెంట్ సబ్‌కమిటీవారు నిన్నటినుంచీ తీవ్రంగా చర్చిస్తున్నారు." ★

---

## అదీ - ఇదీ

### ఫార్మోజాసమస్య :

ఇటీవల అమెరికన్ కాంగ్రెసుకు చెందిన విచారణ సంఘం ఎదట మెకార్థర్ తన కొరియన్ యుద్ధనీతిని సమర్థించుకుంటూ మొదటిసారిగా ఫార్మోజాపై తన అభిప్రాయాలు బైటపెట్టాడు.

"ఫార్మోజాను మనం బుద్ధిపూర్వకంగా గాని, బలవంతాన గాని వదిలిపెట్టినట్లయితే మనకు చాలా నష్టం. అది కమ్యూనిష్టుల చేతుల్లోవుంటే జపాను, ఫిలిప్పైను దీవుల పార్శ్వభాగాలు రక్షణరహితములైపోతాయి. మన పసిఫిక్ దీవుల "గొలుసు" నిరుపయోగమై, మన సరిహద్దులు కాలిఫోర్నియాతీరానికి నెట్టివేయబడతాయి."

ఈ ముక్కలన్నీ జనరల్ మెకార్థర్ ఇదివరకు, జపాన్‌పై దాడిచేసేంత సముద్రబలం కమ్యూనిస్టుసేనలకు లేదని ఖచ్చితంగా చెప్పాడు. ఈ పరస్పర విరుద్ధాభిప్రాయాలను సమన్వయించటానికి కతడు ప్రయత్నించకపోయినా అతని కొత్తవాదన శ్రోతలపై బాగా పనిచేసింది. ఉదాహరణకు సెనేటర్ మోర్స్ ఒక రహస్యం బైట పెట్టాడు.

"ఫార్మోజాసమస్యను ప్రపంచ న్యాయస్థానానికి తీసుకుపోతే కెయిరో ఒడంబడిక ప్రకారం మనం ఫార్మోజాను తిరిగోదకా లిచ్చుకోవలసి వస్తుంది. న్యాయశాసనరీత్యా మనం ఫార్మోజాసమస్యపై నెగ్గలేం. మనం ఫార్మోజాలో ఉన్నామూ అంటే, మన భద్రత, మన ప్రయోజనాలనుబట్టే ఉన్నాం. ఫార్మోజా కమ్యూనిస్టుహస్తగతమైతే మన ప్రయోజనాలు దెబ్బతింటాయి."

కాంగ్రెస్ విచారణసంఘం ఎదట రక్షణమంత్రి జనరల్ జార్జిమార్షల్ సాక్ష్యమిస్తూ మెకార్థర్ కార్యక్రమానికి బదులు మరో స్పష్టమైన కార్యక్రమాన్ని అమలు చేయగలమని సెనేటర్లకు హామీ ఇచ్చినట్టు తెలుస్తున్నది...ముఖ్యంగా చైనాపై ఆర్థిక దిగ్బంధం ప్రయోగించాలని అమెరికా తన మిత్రదేశాలను ఒత్తిడి చేస్తున్నది. (దేశంలో ప్రతిపక్షం కళ్ళనీళ్లు తుడవటానికి) కమ్యూనిస్టువిమానాలు అధిక సంఖ్యలో కొరియాలో ప్రవేశిస్తే మంచూరియామీద ప్రత్యక్షదాడి చెయ్యటానికి సిద్ధంగా ఉంది. శాంతి కుదిర్చేటట్టుచేసే ప్రతిపాదనలను వేటినీ బహిరంగంగా చర్చించేందుకు జంకుతోంది.

అయితే ఈ కార్యక్రమం ఫలించకపోతే మిగిలేది మెకార్థర్ కార్యక్రమమే. మెకార్థర్ కార్యక్రమాన్ని అమలుచేసి తీరాలని అప్పుడు ప్రతిపక్షంచేసే ఒత్తిడిని అమెరికన్ ప్రభుత్వం తట్టుకోగలదా? మెకార్థర్ బాట ననుసరిస్తే ఎదురయ్యేది చైనాతో సంపూర్ణయుద్ధమూ, తత్ఫలితంగా మూడో ప్రపంచ యుద్ధమేగదా?

(న్యూ స్టేట్స్‌మన్—మే 12)

### ఖర్చెక్కువ:

కొరియా ద్వీపకల్పాని కడ్డంగా రేడియో ఆక్టివ్ తరంగాల బెల్టును నిర్మించాలన్న ఆలోచనను విరమించుకున్నట్టే దానికి చాలా ఖర్చవుతుందని అమెరికన్ రక్షణ శాఖవారు అభ్యంతర పెడుతున్నారు. దానిస్థానే నరాలను బాధించేరకం విషవాయువును ద్వీపకల్ప మధ్యంలో నింపెయ్యాలని కొంతకాలంగా ఆలోచన జరుగుతోంది. (న్యూస్‌వీక్—ఏప్రిల్ 30)